
సాక్షి ఒడిశా

ఆదివారం । 15 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ.1,47,605
బంగారం : 150 మిల్లీ గ్రాములు
వెండి : 171 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



చోరీ కేసులో నిందితులు అరెస్టు

ఒక దోపిడీ కేసుకు సంబంధించి కాసీపూర్ సమితి టికిరి పోలీసులు శుక్రవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు.

- IIలో



నదిలో మునిగి వృద్ధుడు మృతి

మల్కన్‌గిరి జిల్లాలోని బలిమెల పోలీసుస్టేషన్ పరిధి చితాపరి గ్రామంలో వృద్ధుడు నదిలో కాలు జారి పడిపోవడంతో మృతి చెందాడు.

- IIలో

న్యూస్‌రీల్



ఈనెల 20న ప్రధాని మోదీ రోడ్ షో

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 20వ తేదీన ఒక్కరోజు పర్యటనకు రాష్ట్రానికి విచ్చేయనున్నారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తొలి వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. తన పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జనతా మైదాన్ వరకు రోడ్ షోలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలోని రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం జూన్ 12 నుంచి 20 వరకు ప్రథమ వార్షికోత్సవాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ప్రధానమంత్రి స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుతారు. అక్కడ నుంచి రోడ్ షో కార్యక్రమంతో ముందుకు సాగి వార్షికోత్సవ ప్రాంగణానికి చేరుతారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల సాఫల్యత, డాక్యుమెంటరీలు, మహిళా సాధికారత, ఉపాధి, యువజన అభివద్ధి, గిరిజన సంక్షేమం మరియు రైతు సంక్షేమ పథకాలకు సంబంధించిన పలు కార్యక్రమాల అమలు తీరు ప్రదర్శించనున్నారు. దీనికి సంబంధించి శనివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్ దేవ్ మరియు ప్రభాతి పరిడా, క్యాబినెట్ మంత్రులు హాజరయ్యారు. దీనిలో భాగంగా పర్యటనకు సంబంధించిన సన్నాహాలపై చర్చించారు.

భువనేశ్వరి దేవి చిత్ర దర్శనం



పూజలందుకుంటున్న భువనేశ్వరి చిత్రపటం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్ర దగ్గర పడుతోంది. మరో వైపు భారీ స్నానమాచరించడంతో అస్వస్థతకు గురైన స్వామివారికి జ్వరం తీవ్రత క్రమంగా పెరుగుతోంది. చీకటి మండపంపై గోప్య ఉపచారాలతో త్వరగా కోలుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అస్వస్థతకు గురి కావడంతో మూల విరాటులను అనవసర గదికి తరలించారు. రత్న వేదిక ఖాళీ అయింది. మూల విరాటుల స్థానాల్లో చిత్రపటాలు దర్శనం ఇస్తున్నాయి. దేవీ సుభద్ర స్థానంలో భువనేశ్వరి మాత చిత్రపటం భక్తులకు దర్శనమిస్తోంది. వికసిత పద్మాసనంలో ధవళ వస్త్ర ధారణతో పసుపు పచ్చని వర్ణ శోభతో చతుర్భుజి భువనేశ్వరి సౌందర్య రాశిగా ఆకట్టుకుంటుంది. రెండు చేతుల్లో ఊర్ధ్వముఖంగా పద్మాలు, మరో రెండు చేతుల్లో అభయ మరియు వరద ముద్రలను ప్రదర్శించి భక్తులను ఆకట్టుకుంటున్నాయి. నిలువెత్తున శోభాయమానమైన ఆభరణాల అలంకరణతో దేవీ తళుక్కుమంటోంది. శ్యామ వర్ణపు కురులతో శిరస్సున మకర మస్తకం, మెడలో పద్మ హారము, కంఠాభరణాలు, చెవులకు కమ్మలు, జుమ్కాలతో పుడక, నత్తు, బులాకి వంటి నాసిక ఆభరణాలతో భువనేశ్వరి అపురూప సౌందర్యం ఆకర్షణీయంగా ఆకట్టుకుంటోంది. దేవీ భువనేశ్వరి చిత్రపటం దగ్గర విశ్వధాత్రి (భూదేవి), శ్రీదేవి (లక్ష్మి) ప్రతిమలు చోటు చేసుకోవడం విశేషం. ఉభయ పార్శ్వాల్లో జయ, విజయులు చామర మరియు వింజామర సేవకులుగా చిత్రపటంలో చోటుచేసుకున్నారు.

ప్రేమతో నాన్న..!

నాన్న శ్రమజీవి. కుటుంబం కోసం అలుపెరుగని ప్రయాణం సాగిస్తాడు. బిడ్డల భవిష్యత్ కోసం త్యాగాలు చేస్తాడు. తన ఇష్టాలను దూరం చేసుకొని, పిల్లల ఇష్టాలనే తన ఇష్టాలుగా మార్చుకుంటాడు. తప్పు చేసినప్పుడు కోపాన్ని చూపిస్తూనే.. ఆ తప్పులు సరిదిద్దుకునేలా మంచి మార్గాన్ని చూపుతాడు. అదే పిల్లలు దివ్యాంగులైతే అల్లాడిపోతూనే అల్లారుముద్దుగా చూసుకుంటాడు. అలాంటి తండ్రే మల్కన్‌గిరి సమితిలోని తొండికి పంచాయతీకి చెందిన రామకృష్ణ. తాను గత 22 ఏళ్లుగా దివ్యాంగులైన పిల్లలే ప్రపంచంగా జీవిస్తున్నాడు. తాను కష్టపడుతూ పిల్లలకు కష్టం తెలియకూడదని నిరంతరం తపిస్తున్నాడు. – మల్కన్‌గిరి

- దివ్యాంగ పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటున్న రామకృష్ణ
- చిన్నారులే ప్రపంచంగా జీవితం
- నేడు ఫాదర్స్ డే



పిల్లలతో రామకృష్ణ



తన బిడ్డల తల దువ్వుతున్న రామకృష్ణ

నలుగురు పిల్లలూ దివ్యాంగులే...



కుమారులకు సేవలు చేస్తూ...

తొండికి గ్రామానికి చెందిన రామకృష్ణకు అదే గ్రామానికి చెందిన బసంతితో 2003లో వివాహం జరిగింది. వీరికి మొదటి సంతానంగా 2004లో మమత అనే కుమార్తె జన్మించింది. ఆడపిల్ల పుట్టడంతో కుటుంబమంతా ఎంతో ఆనందంగా గడిపారు. అయితే బిడ్డకు మూడు నెలల వయస్సు వచ్చిన తర్వాత కళ్లు కనిపించడం లేదని వైద్యులు తెలిపారు. దీంతో చిన్నారిని భువనేశ్వర్ తీసుకెళ్లినా ఫలితంగా లేకపోయింది. అనంతరం వారికి 2006లో కవిత అనే మరో కుమార్తె జన్మించింది. అయితే దురదృష్టావశాత్తు ఆమె కూడా దివ్యాంగురాలే అయ్యింది. తర్వాత 2008లో మూడో కాన్పులో ఇద్దరు మగ బిడ్డలు రాకేష్, రాజేష్‌లు పుట్టగా, వారు కూడా దివ్యాంగులే అవ్వడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. మరోవైపు బసంతి సికిలిన్ అనే వ్యాధిబారిన పడడంతో ఆ కుటుంబ అల్లాడిపోయింది.



కుమార్తె కవితకు జడలు వేస్తూ...



చిన్నారికి టిఫిన్ తినిపిస్తూ...

పిల్లలే ప్రాణంగా...

నలుగురు దివ్యాంగ పిల్లలను ఎంతో కష్టపడి తండ్రి రామకృష్ణ పోషిస్తున్నారు. భార్య బసంతిని చికిత్స కోసం ప్రతినెలా విశాఖపట్నం తీసుకెళ్తుంటారు. పిల్లలకు తినిపించడంతో పాటు రోజువారీ పనులు దగ్గరుండి చూసుకుంటారు. అయితే రామకృష్ణకు ప్రస్తుతం నెలకు కేవలం రూ.5 వేలు మాత్రమే జీతం వస్తోంది. పిల్లలకు గత ప్రభుత్వం దివ్యాంగ పింఛన్‌గా రూ.750 చొప్పున అందించింది. ఇప్పటి బీజేపీ ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.3,500 చొప్పున పింఛన్ ఇస్తుండడంతో నలుగురు పిల్లలకి కలిపి రూ.14 వేలు అందుతోంది. అయితే ఈ డబ్బులు పిల్లల నెలవారీ నిత్యావసరాలు, మెడికల్ ఖర్చులకు సరిపోవడం లేదని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సాయం అందజేయాలని కోరుతున్నారు. పిల్లలకు రామకృష్ణ చేస్తున్న సేవలు మాటల్లో వర్ణించలేనివి. తండ్రి లేనిదే చిన్నారులు అన్నం తినరు, నిద్రపోరు. తండ్రి తమ ముందు ఉంటేనే వారిలో ఆనందం వికసిస్తుంది.



పిల్లల సేవలో రామకృష్ణ తల్లి రాధమణి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ పట్వారీ

- వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ పట్వారీ ఆదేశం

రాయగడ: ప్రస్తుతం వర్షాలు ప్రారంభమవ్వడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఫరూల్ పట్వారీ సూచించారు. ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధి నివారణ చర్యలపై అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. మురికి కాలువలను పరిశుభ్రం చేయాలన్నారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్ధంగా ఉండేలా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గొట్టపు బావుల నీటికి పరీక్షలు నిర్వహించి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటే వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు.

దోమ తెరలపై అవగాహన

మలేరియా వ్యాధి బారి నుంచి రక్షణ కల్పించే దోమ తెరలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. హాస్టల్‌లో విద్యార్థులు తీసుకునే తాగునీటి విషయంలో తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంకులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో అధికారులు అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చంద్ర కాంత్ మాఝి, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారి గోపాల్ నాయక్, జిల్లా ముఖ్య వైద్యశాఖ అధికారి డాక్టర్ ప్రఫుల్ల కుమార్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న కలరా

- జాజ్‌పూర్, భద్రక్‌లో కలరా విజృంభణ
- ఇప్పటివరకు 10 మంది మృతి
- దాదాపు 600 మంది పీడితులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



ఆస్పత్రిలో నేలపై చికిత్స పొందుతున్న బాధితులు

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో వెలుగు చూసిన అతిసార పొరుగు భద్రక్ జిల్లాకు విస్తరించింది. నిత్యం పీడితులు, మృతుల సంఖ్య పెరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన పరీక్షల్లో అతిసారం కలరాగా విజృంభించినట్లు తేటతెల్లం అయింది. పరిస్థితి మరింత విషమించకుండా జిల్లా యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. అతిసారం నమూనా పరీక్షలో కలరా పాజిటివ్‌గా తేలింది. 41 నమూనాల పరీక్షల్లో 8 కలరా పాజిటివ్‌గా తేలింది. ఈ నివేదికల ప్రకారం 600 మంది పీడితులు కలరా బారినపడినట్లు స్పష్టం అయింది. గత 4 రోజుల్లో జాజ్‌పూర్ జిల్లాలో 10 మంది మృతి చెందారు. 10 రోజుల్లోగా కాలుష్య నివారణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి ఆదేశించారు. విస్తృత అవగాహన, క్షేత్రస్థాయి నివారణ మరియు ప్రాథమిక గుర్తింపు మరియు చికిత్స ద్వారా పరిస్థితి అదుపులో ఉందని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా తెలిపారు.

కిక్కిరిసిన ఆరోగ్య కేంద్రాలు

జాజ్‌పూర్ జిల్లాలో వ్యాసనగర్ మరియు జాజ్‌పూర్ మున్సిపాలిటీ, ధర్మశాల, రసూల్‌పూర్, కొర్యై, దానాగాడి, సుకిందాతో సహా 6 మండలాల్లో 600 మందికి పైగా రోగులు విరేచనాలతో బాధపడుతున్నారు. వారందరినీ వైద్య కేంద్రాల్లో చేర్చి చికిత్స చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో తగినన్ని పడకలు లేకపోవడంతో, రోగులకు నేలపై చికిత్స అందిస్తున్నారు. దీంతో ఆస్పత్రుల్లో సరైన చికిత్స, వైద్యం అందడం లేదని పీడితులు వాపోతున్నారు. ఆరోగ్యం కుదుటపడిందని ఇంటికి పంపించిన వెంటనే వాంతులు, విరేచనాలు వంటి కలరా లక్షణాలు బాధించడంతో తిరిగి ఆస్పత్రిలో చేరాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కలరా నియంత్రణ చర్యలపై సీఎస్ మనోజ్ ఆహుజా అధ్యక్షతన సమీక్ష సమావేశం

విందులు నిషేధం

జాజ్‌పూర్ ప్రాంతంలో విందు, వినోదాలు నిషేధించినట్లు జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా రొజ్జొ పండగ సందర్భంగా విందులు, సామూహిక కార్యక్రమాలు జరగడం ఆనవాయితీ. ప్రస్తుత ప్రతికూల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఈ విందు వినోదాలపై ఆంక్షలు విధించడం అనివార్యం అయిందని అధికార వర్గం పేర్కొంది. జిల్లాలో కలరా గుర్తింపు కారణంగా ప్రజలు స్వీయ అవగాహనతో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జిల్లా అధికార యంత్రాంగం అభ్యర్థించింది. ఇంట్లో వండిన ఆహారం, మరిగించిన మరియు వడపోసిన పరిశుద్ధ నీరు మాత్రమే వినియోగించాలని తెలిపారు. దైనందిన నిత్య వినియోగాలకు నది, కాలువ, చెరువు నీరు నివారించాలని తెలియజేశారు.

జాజ్‌పూర్ సందర్శనకు కేంద్ర బృందం

జాజ్‌పూర్ జిల్లాలో అతిసార తీవ్రతరమై కలరాగా విజృంభించింది. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 14 మంది సభ్యుల బృందాన్ని జాజ్‌పూర్ జిల్లాకు పంపనుందని రాష్ట్ర ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా శనివారం తెలిపారు. కేంద్ర పరిశీలన బృందం త్వరలోనే ప్రభావిత ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) మరియు ఒడిశా ఆరోగ్య శాఖ సంయుక్త బృందం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని వెల్లడించారు. ప్రభావితులకు సకాలంలో పరీక్షలు నిర్వహించిన సముచిత వైద్యం అందజేస్తున్నట్లు వివరించారు. 200 నమూనాలకు నిర్వహించిన పరీక్షల్లో 11 నమూనాల్లో విబ్రియో కలరా పాజిటివ్‌గా తేలిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం జాజ్‌పూర్ జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రిలో 213 మంది రోగులు అతిసారానికి చికిత్స పొందుతున్నారు. పరిస్థితిని రాత్రింబవళ్లు నిరవధికంగా పర్యవేక్షించేందుకు ఆస్పత్రిలో ప్రత్యేక నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేశారు.

కటక్ జిల్లాకు విస్తరణ

జాజ్‌పూర్ జిల్లాలో తలెత్తిన అతిసార పొరుగు జిల్లా భద్రక్ నుంచి తాజాగా కటక్ జిల్లాకు విస్తరించింది. అఠొగొడొ మండలం బంకిలోని ఘోలాపూర్ గ్రామంలో అతిసారం వ్యాప్తి చెందింది. ఈ ప్రాంతంలో 4 మంది పిల్లలు సహా 10 మందికి పైగా వ్యాధి బారినపడ్డారు. వారిలో 6 మందిని అఠొగొడొ ఆస్పత్రిలో చేర్చారు. మరో 2 మందిని కటక్ ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది.

అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్
- ఒడిశా విజన్ 2036–47 డాక్యుమెంట్ విడుదల



మాట్లాడుతున్న మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

పర్లాకిమిడి: గజపతి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ అన్నారు. పర్లాకిమిడి పర్యటనలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని అక్కడ నుంచి నేరుగా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రహాల్‌కు వెళ్లారు. ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నబకిశోర శోబోరో, మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా స్థాయి ఒడిశా విజన్ 2036–47 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన 21 హామీల్లో 11 పూర్తి చేశామని, మరో ఏడు హామీలు త్వరలోనే నెరవేరుస్తామని తెలియజేశారు. ఒడిశా విజన్ 2036– 47 నాటికి గజపతి జిల్లాలో వ్యవసాయం, పండ్ల ఉత్పత్తి పరిశ్రమలు, టూరిజం, మిషన్ శక్తి, స్వయం సహాయక డ్వాక్రా గ్రూపులు ప్రగతి పథంలో పయనిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.17 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, ప్రస్తుతం రూ.22 వేల కోట్లతో అనేక కంపెనీల శంకుస్థాపనలు పూర్తయ్యాయని వెల్లడించారు. దీనివల్ల రాష్ట్రంలో 72 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందన్నారు. అనంతరం ఒడిశా విజన్ 2036–47 డాక్యుమెంట్‌ను విడుదల చేశారు.



కార్మిక కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

చెక్కులు అందజేత

ఈ సందర్భంగా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ కుటుంబాలకు నష్ట పరిహారం కింద రూ.3,05,000లు నలుగురికి, అలాగే కార్మిక వర్గాల కుటుంబాలకు నష్ట పరిహారం కింద మరో 14 మందికి రూ.50 వేలు చొప్పున్న చెక్కులను అందజేశారు. అలాగే మిషన్ శక్తి మహిళా గ్రూపులకు చెక్కులు, ప్రకృతి మిత్ర అవార్డులు కింద రూ.10 వేలు చొప్పున్న ఐదుగురికి అవార్డులు అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్, ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా, డీఎఫ్‌వో కె.నాగరాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శంకర్ కెరకెటా తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా టాపర్‌గా స్నేహాసిస్ దాస్




స్నేహాసిస్ దాస్

భువనేశ్వర్: నీట్ యూజీ 2025 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఫలితాల ప్రకారం పరీక్షకు హాజరైన 22,09,318 మంది విద్యార్థుల్లో, 12,36,531 మంది అర్హత సాధించారు. కాగా నీట్ ఒడిశా టాపర్గా స్నేహాసిస్ దాస్ నిలిచారు. అఖిల భారత ర్యాంక్‌లో అతడు 60వ స్థానాన్ని సాధించాడు.

హ్యాపీ రొజ్జొ

రాష్ట్ర ప్రజల ఆనందోత్సాహాల పండగ రొజ్జొ. పుడమి తల్లి స్త్రీత్వం (రొజ్జొ) ప్రతీకగా బాలికలు, యువతులు వరుసగా మూడు రోజుల పాటు వేడుకగా రొజ్జొ పండుగ జరుపుకుంటారు. శనివారం నుంచి రొజ్జొ పండగ సంబరాలు ఆరంభమయ్యాయి. దీనిలో భాగంగా పూరీ సాగర తీరంలో సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ ఈ ఆకర్షణీయమైన సైకత శిల్పం ఆవిష్కరించారు.

– భువనేశ్వర్/పూరీ



క్లుప్తంగా

సంకటహర చతుర్థి పూజలు



ప్రత్యేక పూజలందుకున్న విజయ గణపతి

భువనేశ్వర్: సంకటహర చతుర్థి పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అకౌంట్స్ కాలనీ బాలాజీ మందిరం సముదాయం ప్రాంగణంలో వేంచేసిన విజయ గణపతి స్వామివారికి చెరుకు రసం, గరిక, జలంతో విశేష అభిషేకము చేశారు. గరిక, ధవళ అర్క పుష్పాలతో నిర్వహించిన అర్చనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంట్లో బయటపడిన పాము పిల్లలు



ఇంట్లో బయటపడిన పాము పిల్లలు

భువనేశ్వర్: జగత్‌సింగ్ పూర్ జిల్లా ఎరసమా మండలం ఒంధారి పంచాయతీ ఎగువ నువాగాంవ్ గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో 36 పాము పిల్లలు శనివారం బయటపడ్డాయి. ఈ పరిస్థితి ఇరుగుపొరుగు వారిని బెంబేలెత్తించింది. అనుబంధ వర్గాల సహకారంతో వీటిని సురక్షితంగా సహజ ఆవాస ప్రాంతాల్లో విడిచిపెట్టారు. ఇవి నాగు పాము సంతతిగా భావిస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి యువకుడికి గాయాలు



గాయాలతో చికిత్స పొందుతున్న సికక

రాయగడ: మామిడి చెట్టుపై మామిడి కాయలు కోస్తున్న సమయంలో కాలుజారి ప్రమాదవశాత్తు కిందపడడంతో ఒక యువకుడికి గాయాలయ్యాయి. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పర్శాలి గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గాయాలు తగిలిన వ్యక్తి బామ్ సికకగా గుర్తించారు. మామిడికాయలను కోసేందుకు గ్రామ సమీపంలోని తోటలోకి వెళ్లిన సికక మామిడి కాయలు కోస్తున్న సమయంలో కిందపడిపోయాడు. పెద్ద శబ్దం వినబడడంతో సమీపంలోని వారు అక్కడికి వెళ్లి చూడగా కిందపడి ఉన్న సికకను వెంటనే కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే అతనిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు.

సముద్రంలో మునిగి పర్యాటకుడు మృతి

భువనేశ్వర్: పూరీ సముద్రంలో స్నానం చేస్తున్న పర్యాటకుడు అకస్మాత్తుగా కెరటాల్లో కొట్టుకుపోయాడు. నీటిలో మునిగి తేలుతున్న అతడిని ఒడ్డుకు తీసుకు వచ్చి చికిత్స కోసం స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అతడు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. మృతుడు చందపూర్ ప్రాంతానికి చెందిన భరత్ జెనాగా గుర్తించారు.

నదిలో మునిగి వృద్ధుడు మృతి



భగవాన్ నాగ్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసుస్టేషన్ పరిధి చితాపరి గ్రామంలో శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి నది వద్దకు వెళ్లిన వృద్ధుడు కాలుజారి పడిపోవడంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే గ్రామంలోని ఝాటిమాటి వీధికి చెందిన భగవాన్ నాగ్ (60) అనే వృద్ధుడు గ్రామానికి సమయంలోని చెరువు వద్దకు ఉదయం వెళ్లాడు. అయితే అక్కడ కాలుజారి పడిపోవడంతో చనిపోయాడు. అయితే సమీపంలో ఉన్న స్థానికులు వెంటనే ఆయనను బయటకు తీసి అంబులెన్స్‌లో బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలిసిన బలిమెల ఐఐసీ ధీరాజ్ పట్నాయిక్ ఆరోగ్య కేంద్రానికి చేరుకొని కేసు నమోద్ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘనంగా రొజ్జొ



మల్కన్‌గిరి: మత్తిలి సమితిలో ఏర్పాటు చేసిన కేక్



రాయగడ: మిస్ రొజ్జొరాణిగా నిలిచిన సుగుణ

రాష్ట్రవ్యాప్తంగా రొజ్జొత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఒడియా ప్రజల సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రొజ్జొ ఉత్సవాలు అంతా కలిసి జరుపుకోవడం వారి సమైఖ్యతకు అద్దం పడుతోందన్నారు. మహిళా సంఘాల ద్వారా ఇటువంటి తరహా కార్యక్రమాలను నిర్వహించి సంస్కృతీ, సాంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైన ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. పలుచోట్ల వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పిల్లలు కొత్త బట్టలు ధరించి ఊయల ఊగుతూ సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: ఊయల ఊగుతున్న పిల్లలు, మహిళలు



జయపురం: వివిధ రకాల పిండి వంటలు చేసిన మహిళలు

నివాళులు



పునరావృతం కారాదు అనే రెండు పదాల నినాదంతో ఇటీవల సంభవించిన ఘోరాతి ఘోరమైన విమాన దుర్ఘటనలో మరణించిన వారి ఆత్మకు సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ ఇలా ఘన నివాళులు అర్పించారు.

– భువనేశ్వర్/పూరీ

చోరీ కేసులో నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: ఒక దోపిడీ కేసుకు సంబంధించి జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసులు శుక్రవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో టికిరిలోని దొరావీధికి చెందిన గిరిధర్ దొర, రసీమ నాయక్, కో-ఆపరేటివ్ కాలనీలో ఉంటున్న పింటునాయక్‌లుగా గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. టికిరిలోని ఆర్‌సీబీ కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తున్న మంజూర అనసారి అనే వ్యక్తి ఎల్‌అండ్‌టీ కంపెనీలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో విధులు నిర్వహించుకుని ఇంటికి వస్తున్న సమయంలో రైల్వేస్టేషన్ రోడ్డు సమీపంలో ముగ్గురు గుర్తు తెలియని దుండగులు అతనిని అడ్డగించి, అతని వద్దనున్న రూ.22 వేల నగదు, కొన్ని సర్టిఫికెట్లను తీసుకొని పరారయ్యారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు శుక్రవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

రైల్వేస్టేషన్ వద్ద గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఒక యువకుడిని అరెస్టు చేసి అతని నుంచి 20.700 కిలోల గంజాయిని అబ్కారీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఒక యువకుడి బ్యాగును తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. ఈ కేసులో అరెస్టైన వ్యక్తి కందమాల్ జిల్లాకు చెందిన నరేంద్ర నాయక్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. అబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ దాస్ నేతృత్వంలో ఓఐసీ సంజయ్ కుమార్ ప్రధాన్, ఏఎస్ఐ రాసి నాయక్, కానిస్టేబుల్ మెలకా కుమారి, కిషోర్ కుమార్ బిడిక, అమర్ కుమార్ దలాయి, సందీప్ కుమార్ పాత్రోలు దాడుల్లో పాల్గొన్నవారిలో ఉన్నారు.

బంగారు వ్యాపారి కుటుంబంపై దాడి

- నగల బ్యాగ్‌తో దుండగుల పరారీ



బాధితుల వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొరాపుట్: బంగారు వ్యాపారి కుటుంబంపై దోపిడీ దొంగలు దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం రాత్రి నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కేంద్రంలో మెడికల్ జంక్షన్ వద్ద మా సంతోషి జ్యూయలర్స్ యజమాని రామ్ కుమార్ దక్వ షాప్ మూసివేసిన అనంతరం ఇంటికి బయల్దేరాడు. ఇంటికి వెళ్లే ముందు షాపులోని బంగారు ఆభరణాలు ఒక బ్యాగ్‌లో పెట్టుకున్నాడు. కొడాబట్ గ్రామంలో తన ఇంటికి చేరుకునే సమయానికి ఇంటి బయట సుమారు 8 మంది దోపిడి దొంగలు అడ్డగించారు. ఆ బ్యాగ్ ఇవ్వాలని హెచ్చరిస్తూ దాడి చేశారు. ఇదే సమయంలో అతని భార్య వచ్చి అడ్డగించింది. దీంతో ఆమెపై కూడా దాడికి తెగబడ్డారు. దీంతో దంపతులు తీవ్రగాయాలతో రక్తపు మడుగులో కుప్పకూలారు. వారి వద్ద బ్యాగ్ తీసుకొని పారిపోవాలని ప్రయత్నం చేస్తుండగా, వారి 10 ఏళ్ల కుమారుడు వారిని చూసి పెద్ద ఎత్తున కేకలు వేశాడు. అంతేకాకుండా తల్లిదండ్రులను రక్షించుకోవడానికి తన సమీపంలో ఉన్న రాళ్లని దొంగలపై విసిరాడు. స్థానికులు కూడా దాడి చేస్తారనే అనుమానంతో దొంగలు తమ తుపాకులకు పని చెప్పారు. కాల్పులు చేస్తూ నగల బ్యాగ్‌తో పారిపోయారు. వెంటనే స్థానికులు అక్కడికి చేరుకొని బాధితులను రాయిఘర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తల్లిదండ్రులను రక్షించుకోవడానికి బాలుడు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు, స్థానికులు అభినందించారు.



రాయిఘర్ ఆస్పత్రిలో బాధితులు



బాధితుడి ఇంటి వద్ద గుమిగూడిన ప్రజలు



బంగారు దుకాణం

పోలీసులకు చిక్కిన డిజిటల్ కేటుగాళ్లు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద. వెనుక నిందితులతో పోలీసులు

- రూ.13.5 లక్షలతో మహిళా వైద్యురాలిని బురిడీ కొట్టించిన వైనం
- జిల్లాలో తొలిసారి డిజిటల్ అరెస్టు కేసు ఛేదించిన పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రం సమీపంలోని రాగోలు జెమ్స్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న మహిళా వైద్యురాలు ప్రొఫెసర్ రేవతిని మోసగించిన డిజిటల్ కేటుగాళ్లు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. వైద్యురాలికి ఫోన్ చేసి హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారంటూ బెదిరించి సీబీఐ డిజిటల్ అరెస్టు పేరిట రూ.13.5 లక్షలకు టోకరా వేయడంతో బాధితురాలు గత నెల 14న ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి సూచనలతో డీఎస్పీ సిహెచ్ వివేకానంద పర్యవేక్షణలో సీఐ సీహెచ్ పైడపునాయుడు ఎస్ఐలు హరికృష్ణ, రాజేష్‌లు బృందాలుగా విడిపోయి కేసును ఛేదించారు. ఈ మేరకు డీఎస్పీ వివేకానంద శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

వైద్యురాలికి బెదిరింపు ఫోన్‌కాల్స్‌తో..

గత నెల 14న ఉదయం పది గంటల సమయంలో వైద్యురాలికి గుర్తు తెలియని నెంబర్ల నుంచి పదే పదే ఫోన్లు వచ్చాయి. బెంగళూరులోని అశోక్ నగర్ పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని.. మీ ఆధార్ నంబర్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్‌కు హ్యూమన్ ట్రాఫికింగ్(మహిళలను, యువతులను బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ అక్రమంగా తరలించడం)కు సంబంధం ఉన్నట్లు తేలిందని, దాని వల్ల మీ బ్యాంకు ఖాతాలో డబ్బులు పడుతున్నాయని, చట్టరీత్యా ఇది నేరమని, సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారని, డిజిటల్ అరెస్టు చేస్తారని భయపెట్టారు. కోర్టులో మీ తరపున వాదించడానికి కొంత సొమ్ము డిపాజిట్ చేస్తే డిజిటల్ అరెస్టు ఆగుతుందంటూ మాయమాటలు చెప్పి రూ. 13.5 లక్షలను ఏపీలోని జగ్గంపేట అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. తర్వాత కాల్స్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన వైద్యురాలు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ రాజేష్, వెంకటరమణ, ఈశ్వరరావు, ధనలక్ష్మిల బృందం పదిరోజులు బయట రాష్ట్రాల్లోనే ఉంటూ దర్యాప్తు చేపట్టారు. వీరికి జిల్లా సైబర్ సెల్ పోలీసులు సహకారమందించారు. జగ్గంపేట అకౌంట్ ఫేక్‌దని గుర్తించారు.

పెట్రోల్ కొట్టడంతో దొరికిపోయి..

కేరళ రాష్ట్రంలోని మలబార్ తీరం వెంబడి ఉన్న కోజికోడ్ (కాలికట్) నగరం ఓజీపాడుకు చెందిన నౌఫలా షెరీన్(24) తన బాయ్‌ఫ్రెండ్‌కు స్కూటీలో పెట్రోల్ కొట్టించడానికి బంక్ వద్దకు వెళ్లి తన ఖాతానుంచి రూ.120 డ్రా చేయడం..అక్కడి సీసీ పుటేజీ ఆధారంగా బండిని గుర్తించి చిరునామా తెలుసుకోవడంతో సూత్రధారులెవరన్నది తెలిసింది. దుబాయ్‌కు చెందిన సలీమ్ అనే వ్యక్తి ఖాతా నుంచి నౌఫలా షెరీన్‌కు రూ. 6 లక్షలు పడినట్లు తేలడంతో మొత్తం తీగ లాగారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన రూమస్ షరీఫ్, రెయాన్ అహ్మద్ ఖురేషిలు వాయినాడ్ కేంద్రంగాను, నౌఫలా షెరీన్, నిజాముద్దీన్ సీపీ (కేరళ), ఫహద్ అహ్మద్‌లు కేరళలోని కోజికోడ్ కేంద్రంగాను రెండు బ్యాచులుగా వీడి ఈ నేరాన్ని లింక్‌సిస్టమ్‌లా చేశారని పసిగట్టారు. వీరికి దుబాయ్‌లో ఉన్న సలీమ్ మంచి స్నేహితుడు కావడంతో అంతా పథకం ప్రకారం చేశారని, అయాన్ అనే వ్యక్తి కూడా ఇందులో భాగస్వామిగా ఉన్నారని, హర్యానాకు చెందిన మరికొందరు ఉండొచ్చని విచారణలో తెలుసుకున్నారు. పైన పేర్కొన్నవారంతా స్నేహితులు కావడం.. వారి సంపాదన విలాసాలకు చాలక పోవడంతో అక్రమ మార్గంలో డబ్బులు సాధించాలనే లక్ష్యంతోనే ఈ నేరం చేశారు. బాధితులు వేసే సొమ్ము వారి అకౌంట్లలో పడ్డాక క్షణాల్లో అమౌంట్‌ను డ్రా చేసి ఖాతాలను క్లోజ్ చేసి వారి వారి వివిధ అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్ చేసేస్తారు. ఈ విధంగానే సలీమ్ నౌఫలాకు రూ. 6 లక్షలు, రెయాన్ అహ్మద్ ఖురేషి రూమస్‌షరీఫ్‌కు రూ.5.80 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు.

పట్టుబడ్డారిలా..

ఈ క్రమంలో ఈ నెల 13న కొందరి నుంచి బ్యాంకు అకౌంట్లు కొనే నిమిత్తం రూమస్‌షరీఫ్, నౌఫలా షెరీన్, నిజాముద్దీన్ సీపీ విశాఖపట్నం వస్తున్నట్లు ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడుకు సమాచారం వచ్చింది. మధ్యాహ్నం ఒంటిగంటకు విశాఖ రైల్వే స్టేషన్లలోసిబ్బందితో మాటువేసి పట్టుకున్నారు. అనంతరం రూమస్ షరీఫ్ నుంచి రూ.లక్ష, నౌఫలా షెరీన్ నుంచి రూ. 2.5 లక్షలు, నిజాముద్దీన్ నుంచి రూ. 2.5 లక్షలు మొత్తంగా రూ. 6 లక్షల నగదు, మూడు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ పైడపునాయుడు కేసును చాకచక్యంగా ఛేదించారని, మైసూర్, కోజికోడ్ ప్రాంతాలు తిరిగి కేసును ఛేదించిన ఎస్ఐ రాజేష్ బృందాన్ని, ఎస్ఐ హరికృష్ణలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

భాస్కరరావుకు 'బాలు' స్మారక పురస్కారం



కె.భాస్కరరావు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన ఫిల్మ్ డబ్బింగ్ ఆర్టిస్టు, ఆల్ ఇండియా రేడియో బి-గ్రేడ్ గాయకుడు కె.భాస్కరరావు డాక్టర్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. ఘంటసాల, బాలు, ఆనంద్ (జి.బి.ఎ) స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు ఈ నెల 16న బాపూజీ కళామందిర్‌లో జరిగే జయంత్యుత్సవ కార్యక్రమంలో సత్కరించనున్నారు. భాస్కరరావు మూడు దశాబ్దాలుగా గాయకునిగా, సామాజిక సేవకుడిగా అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. గతంలో ఈయన హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో లలిత సంగీతం డిప్లమో కోర్సులో ఉత్తమ విద్యార్థి పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా కొనసాగుతూనే పార్ట్ టైం ప్రాతిపదికన కోటబొమ్మాళి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. భాస్కరరావుకు పురస్కారం ప్రకటించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రాణరక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు

కవిటి: అగ్రవర్ణ కులాలకు చెందిన అధికార పార్టీ నేతల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ డిగొనపపుట్టుగకు చెందిన బోనెల హరికృష్ణ శనివారం కవిటి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మే 28న డిగొనపపుట్టుగలో తనపై జరిగిన దాడి అనంతరం బెదిరింపులు వస్తున్నాయని, అగ్రవర్ణ కులాలకు చెందిన ముగ్గురుపై తనకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై ఎస్ఐ రవివర్మ స్పందిస్తూ విచారణ చేపట్టి బాధ్యులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.

బాధితులకు రూ.25 వేల పరిహారం



బాధితులతో మాట్లాడుతున్న రబినారాయణ నందో తదితరులు

జయపురం: ఈనెల 3వ తేదీన కొరాపుట్ సాహిద్ లక్ష్మణ్ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రిలో తప్పుడు ఇంజక్షన్ ఇవ్వడం వలన ఆరుగురు మరణించిన విషయం తెలిసిందే. దీంతో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు మాజీ మంత్రి రబినారాయణ నందో నేతృత్వంలో బీజేడీ ప్రతినిధుల బృందం రెండు బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించింది. ముందుగా రబినారాయణ నందో నేతృత్వంలో టీమ్ జయపురం సమితి జయంతిగిరి పంచాయతీ మీనాగుడ గ్రామానికి చెందిన మృతురాలు రొక్మిణీ పెంటియ ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారికి బీజేడీ పార్టీ అండగా ఉంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం బొరిగుమ్మ సమితి సర్గిగుడ పంచాయతీ బొడొపిండాపాదర్ గ్రామం వెళ్లారు. ఆ గ్రామంలో మరణించిన భగవాన్ పొరజ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ రెండు బాధిత కుటుంబాలకు బీజేడీ తరుపున ఒక్కొక్కరికీ రూ.25 వేల చెక్కు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేడీ నేతలు బాలారాయ్, దుర్గ మిశ్ర, శివ పట్నాయిక్, బి.బాలంకిరావు, రాజేంద్ర రథ్, బొరిగుమ్మ సమితి అధ్యక్షురాలు దీప్తి నాయిక్, జిల్లా పరిషత్ సభ్యురాలు మంజుల ఘాశీ, ప్రసాద్ సాహు, గౌరీ బెహర, ఎస్.ముని తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం



కొవ్వొత్తుల ర్యాలీలో తిలక్, నాయకులు, కార్యకర్తలు

టెక్కలి: ఈ నెల 12వ తేదీన అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పిస్తూ శనివారం టెక్కలిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా విమాన ప్రమాదం చోటు చేసుకుని వందలాది మంది మృత్యువాత పడడం బాధాకరమన్నారు. మృతి చెందిన వారి ఆత్మకుశాంతి కలగాలని కోరుతూ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పి.వసంతరెడ్డి, నాయకులు వై.చక్రవర్తి, జి.గురునాథ్‌యాదవ్, ఎస్.హేమసుందర్‌రాజు, చిన్ని జోగారావు, ఎ.రాహుల్, కె.నారాయణమూర్తి, కె.సంజీవ్, పి.వెంకట్రావు, పి.మోహన్, ఎం.శంకర్, కె.కామేష్, ఎ.విష్ణు, మదీన్, కార్తీక్, మురళీరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, ఎం.గణపతిరావు, పి.వైకుంఠరావు, డి.పోలయ్య, బి.రాజేష్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగు పాటుకు ఫీల్డ్ అసిస్టెంట్ దుర్మరణం

• హుస్సేనుపురంలో విషాదం


శ్రీనివాసరావు మృతదేహం

వీరఘట్టం: ఉపాధి చెరువు పనుల వద్ద మొబైల్ హాజరు వేసుకునేందుకు వెళ్లిన ఫీల్డ్ అసిస్టెంట్ పిడుగు పాటుకు గురై శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని హుస్సేనుపురం గ్రామ శివారులో చెరువు పనులు జరుగుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ ఖండాపు శ్రీనివాసరావు ఉదయం 9 గంటలకు పనుల వద్దకు వెళ్లి హాజరు వేసుకున్నాడు. సాయంత్రం 4 గంటలకు మళ్లీ హాజరు వేసుకునేందుకు చెరువు వద్దకు బయలుదేరాడు. అప్పటికే వర్షం పడుతుండడంతో వేతనదారులంతా వెనుదిరిగారు. గ్రామ శివారులో ఉన్న చెరువు వద్ద మొబైల్ యాప్‌లో అటెండెన్స్ వేసేందుకు శ్రీనివాసరావు మొబైల్ ఆన్ చేసే సరికి సమీపంలో పిడుగు పడడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడని వేతనదారులు తెలిపారు. దూరంగా ఉన్న వేతనదారులు పరుగున వెళ్లి సపర్యలు చేశారు. వెంటనే వీరఘట్టంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాసరావు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాదం అలుముకొంది. తల్లిదండ్రులు జట్లమ్మ, వెంకటనాయుడు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


కాంతమ్మ మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని మృతదేహం ఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వై.రవికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైన విషయం సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచామన్నారు. దీంతో బొబ్బిలి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన తిమనాన కాంతమ్మ (55)గా బంధువులు గుర్తించారని తెలిపారు. మృతురాలు గత 25 సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయి ఎప్పటికప్పుడు ఇంట్లో నుంచి వెళ్లిపోవడం, అందే సమాచారం మేరకు మళ్లీ ఇంటికి తీసుకువెళ్లడం జరుగుతుందని బంధువులు తెలిపారని చెప్పారు. ఈ క్రమంలోనే రాజాం మండలం బొద్దాం వైపు వచ్చి ఈ నెల 13 అర్ధరాత్రి సమయం నుంచి తెల్లవారు సమయంలో ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మృతురాలి బంధువు వజ్జి వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి..


ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి – గజపతినగరం రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని రైలు ఢీకొనిగాని, రైలు నుంచి జారిపడిగాని గుర్తు తెలియని వ్యక్తి శనివారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో మృతి చెందినట్టు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వర్రావు తెలిపారు. మృతుని వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుని శరీరంపై ఎర్ర రంగు షర్టుతో పాటు నలుపు రంగు ప్యాంటును ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతుని జేబులో కేసింగ నుంచి చెన్నె సెంట్రల్‌కు వెళ్తున్నట్టు టిక్కెట్టు ఉన్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. మృతదేహాన్ని విజయనగరంలోని మహారాజ కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

17న అండర్ -16 క్రికెట్ జట్టు ఎంపికలు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అండర్ – 16 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జి క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2009 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. అలాగే పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డ్, జనన ధ్రువీకరణ పత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకు రావాలన్నారు. ఉదయం 7.30 గంటలకు నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత కిట్టుతో హాజరు కావాలని ఆయన సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది..

- ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే నెల 1 నుంచి 3 రోజుల పాటు జిల్లా స్థాయిలో ఎంపికలు
- జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయి ఎంపికలకు అర్హత


వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు(ఫైల్)

విజయనగరం: పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా వారికిష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఆటల్లో రాణిస్తే వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎంతోమంది తెలుగువారు క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. చిన్నప్పటి నుంచి పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో మెరికలుగా తీర్చిదిద్దడానికి కడపలో క్రీడా పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది ఆటల్లో రాణించి, ఉన్నత స్థాయికి వెళ్లారు. ఈ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి (2025–26) 4, 5 తరగతుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రీడా పాఠశాలలో ప్రవేశాలు పొందిన వారికి మంచి భవిష్యత్తు లభించనుంది.

19వ తేదీ వరకు గడువు

క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో 40 సీట్లు, ఐదో తరగతిలో 40 సీట్లకు సంబంధించి ఈ ఏడాది ప్రవేశాలను చేపట్టనున్నారు. ఒక్కో తరగతిలో 20 మంది బాలురు 20 బాలికలను తీసుకుంటారు. గతంలో మూడు దశల్లో (మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి) ఎంపికలను చేపట్టేవారు. ఈ ఏడాది నుంచి రెండు దశల్లో (జిల్లా, రాష్ట్ర స్థాయి) మాత్రమే ఎంపికలు నిర్వహిస్తారు. నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం 01-04-2015 నుంచి 31-03-2017 మధ్య జన్మించిన వారు, ఐదో తరగతిలో ప్రవేశాలకు 01-04-2014 నుంచి 31-03-2016 మధ్య పుట్టిన వారు అర్హులు. ఈ నెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి సమాచారం క్రీడా శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఎంపికలు ఇలా..!

జిల్లా స్థాయి ఎంపికలను ఈ ఏడాది జులై 1 నుంచి 3వ తేదీ వరకు విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో చేపట్టనున్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్, షటిల్‌రన్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 600 మీటర్ల పరుగు లాంటివి నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తారు. అనంతరం రాష్ట్ర స్థాయి శారీరక సామర్థ్య ఎంపికలను ఈ ఏడాది జులై 10, 11 తేదీల్లో నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరచిన వారు క్రీడా పాఠశాల ప్రవేశం పొందేందుకు అర్హులుగా నిలుస్తారు. జులై 24 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

క్రీడాకారులకు చక్కని వేదిక



భావి భారత క్రీడాకారులుగా ఎదగాలంటే.. క్రీడా స్ఫూర్తి ఉండి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలనుకునే వారికి క్రీడా పాఠశాల చక్కటి వేదిక. కార్పొరేట్ కంటే దీటుగా విద్యతో పాటు అనుభవజ్ఞులైన శిక్షకులతో శిక్షణ ఇస్తారు. ప్రవేశం దొరికితే మంచి భవిష్యత్తు ఉంటుంది. అన్ని సౌకర్యాలు ఉంటాయి. చదువు, క్రీడా శిక్షణ ఉచితమే. ఎంపిక పోటీలకు సంబంధించి కొన్ని మార్పులు ఉన్నాయి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వస్తే తెలియపరుస్తాం.

– ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, విజయనగరం

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి


రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

- జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

విజయనగరం: ఆత్మరక్షణ క్రీడ తైక్వాండోలో విజయనగరం జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి సత్తా చాటాలని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు ఆకాంక్షించారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో అనంతపూర్ జిల్లా తాడిపత్రిలో జరిగిన సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తంగా 33 పతకాలు కైవసం చేసుకుని ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 19 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, 8 కాంస్య పతకాలు చేజిక్కించుకుని విద్యలనగరం విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అయ్యలు, వేణుగోపాలరావులు అభినందించారు. జిల్లా క్రీడాకారులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన వరాలేమయ్యాయి..!


డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

- మాట తప్పిన కూటమి ప్రభుత్వం
- ఎమ్మెల్సీ ఇస్తామన్న లోకేష్ హామీ అమలు చేయాలి
- విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

బొబ్బిలి: గత ఎన్నికల్లో టీడీపీ కూటమి బీసీ డిక్లరేషన్ ప్రకటించి అందులో విశ్వబ్రాహ్మణులకు ప్రకటించిన వరాల ఊసేలేదని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు అన్నారు. జిల్లా అధ్యక్షుడు ముగడ వెంకటరమణ అధ్యక్షతన పట్టణంలో సంఘ నాయకులు, సభ్యులతో శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణుల సంఖ్య 25లక్షల మందికి పైగా ఉండగా కూటమి ప్రభుత్వం కేవలం 7లక్షలకు కుదించి లెక్క చూపుతోందన్నారు. కచ్చితమయిన లెక్కను చూపేందుకు తగిన కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. విశ్వబ్రాహ్మణులకు టీడీపీ ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోలేదని, ఇందుకోసం తాము తీవ్ర ఆవేదనలో ఉన్నామన్నారు. తమ కులానికి నష్టం కలిగించే జీఓ నంబరు 272ను సవరిస్తామన్న కూటమి ప్రభుత్వం దానిని పట్టించుకోలేదన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు, స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి అందలమెక్కిస్తామన్నారనీ, కానీ ఈ హామీపై కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఇవే అమలు కాలేదంటే ఇక ఈ రెండింటినీ ఎంఎస్ఎంఈ పరిశ్రమల రంగానికి అనుసంధానం చేస్తామనడం మరింత మోసమయిందన్నారు. నారా లోకేష్ తమ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలన్నారు. పంచ వృత్తులు చేసుకునే విశ్వబ్రాహ్మణులందరినీ ఒకే సామాజిక వర్గంగా పరిగణించాలని, దీనిపై ప్రత్యేక జీవో జారీ చేయాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో యువ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ములగపాటి బంగార్రాజు, ఉపాధ్యక్షుడు దనాల కోట శోభన్‌బాబు, గణేష్, జి.నారాయణ, త్రినాధ హరిబాబు, కంచుమోజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం ఇవ్వకుంటే న్యాయ పోరాటం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సంబంధించి తల్లికి వందనం పథకం అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం అందకపోతే న్యాయ పోరాటం చేసైనా ఈ పథకం అందే విధంగా చూస్తామని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అమలు చేయడం లేదని అన్నారు. విద్యాశాఖ దగ్గర ఉన్న సమాచారం మేరకు సుమారు 88లక్షల మంది విద్యార్థులు ఉండగా 55 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే ఈ పథకం అందించారని వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థికి రూ.15వేలు అందజేస్తామని హామీ ఇవ్వగా ఇప్పుడు వారి ఖాతాల్లో రూ.13వేలు మాత్రమే జమ అవుతుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద రూ.15వేలు మంజూరు చేసి పాఠశాల నిర్వహణ ఖర్చుల కోసం రూ.2వేలు తగ్గించి రూ.13వేలు అందిస్తే ఇప్పటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర విమర్శలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్నది ఏమిటని ప్రశ్నించారు. ఏ కుటుంబంలో అయినా ఒకరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తే ఆ కుటుంబంలో విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి నిబంధనలు పెట్టకుండా అందిరికీ అమ్మ ఒడి అందజేశామని వివరించారు. అర్హులై ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు ఈ పథకానికి ఎంపిక చేయకుండా టీడీపీ సానుభూతి పరులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గకుండా పని చేయాలని అన్నారు. లేకుంటే న్యాయ పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు వావిలపల్లి జగన్మోహనరావు, రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, డాక్టర్ బి.నరేంద్ర పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపికలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్–15 బాల, బాలికల చెస్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 15న ఆదివారం నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కెవి.జ్వాలాముఖి శనివారం తెలిపారు. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనపగరం, ఫైర్ చెస్ స్కూల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎంపిక పోటీల్లో 2010 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులు విధిగా తమ జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది బాల, బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 97033 44488 నంబరును సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి డీఏజుగాపై అవగాహన

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఆదివారం నుంచి దర్తీ అబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజు)పై అవగాహన కల్పిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా అధికారులతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 15 నుంచి 30 వరకు డీఏ జు అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆధార్, రేషన్, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కులధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డ్, పీయం కిసాన్ కార్డులు, జన్‌ధన్ ఖాతా, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా కవరేజ్, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ సామాజిక భద్రత పింఛన్లు, ఉపాధి హామీ, పీఎం విశ్వకర్మ, ముద్ర తదితర జీవనోపాధి పథకాలు, పీఎంఎంవీవై, ఇమ్యునైజేషన్ తదితర స్త్రీ శిశు సంక్షేమ ప్రయోజనాలు అందిస్తామన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

ఏనుగులు సంచరిస్తున్నాయి.. జాగ్రత్త

సీతానగరం: మండలంలోని ఏగోటివలస పొలాల నుంచి శనివారం కోటసీతారాంపురం మార్గంలోకి ఏనుగుల గుంపు చేరుకుందని, రాత్రిపూట ప్రయాణించేవారు అప్రమత్తంగా వ్యవహరించాలని అటవీశాఖ అధికారులు కోరారు. కోటసీతారాంపురం, పునుబుచ్చింపేట, రంగంపేట, ఏగోటివలస గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. రాత్రిపూట ఇళ్ల నుంచి బయటకు వెళ్లరాదన్నారు.

పేదల ఇళ్ల స్థలాల కోసం ఆందోళన



ధర్నా చేస్తున్న నారాయణరావు, ధర్మ తదితరులు

విజయనగరం టౌన్: పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని పట్టణ బడుగు, బలహీన వర్గాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి నారాయణ రావు, చెన్నా ధర్మ ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై స్థానిక ధర్మపురి ప్రాంతంలో శనివారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పేదలకు హామీల వర్షం కురిపించారని, అర్బన్ ఏరియాలోని పేదలకు రెండు సెంట్లు, రూరల్ ఏరియాలోని పేదలకు మూడు సెంట్లు స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లు మంజూరు చేయలేదని, కొత్త వారికి ఎప్పుడిస్తారో కూడా స్పష్టత లేదన్నారు. తక్షణమే ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని లేకపోతే భవిష్యత్‌లో పోరాటం చేస్తామన్నారు. ఈ నెల 16న తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నీలాపు అప్పలరాజు రెడ్డి, గంటా సీతమ్మ, గిడిజాల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాలువ ఇలా.. సాగునీరెళ్లేదెలా?



చిత్రంలో పూడికలతో రూపుకోల్పోయిన పిల్లకాలువ జియ్యమ్మవలస మండలం కుదమ గ్రామ సమీపంలోనిది. వట్టిగెడ్డ ప్రాజెక్టు పరిధిలోని కాలువలన్నింటిదీ ఇదే పరిస్థితి. ఖరీఫ్ ఆసన్నమవుతున్నా కాలువలను అభివృద్ధి చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి కష్టాలు తప్పేలా లేవని బెంగపడుతున్నారు. వాస్తవంగా వట్టిగెడ్డ పరిధిలో సాగునీటి వనరుల అభివృద్ధికి నీటి సంఘాల ద్వారా 14 పనులకు 39.5 లక్షలు మంజూరయ్యాయి. అలాగే, ఎఫ్‌డీఎంఎస్ కింద మూడు పనులకు రూ.12 లక్షలు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ కింద 30 లింక్ చెరువుల అభివృద్ధి పనులకు రూ.మూడు కోట్లు, చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. కూటమి నేతల మధ్య పనుల పంపకాల్లో తేడా రైతులకు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- జియ్యమ్మవలస రూరల్

పోలీసులకు చెమటలు పట్టించి తప్పించుకుపోయారు..

- తప్పించుకోబోయి డీఎస్పీ వాహనాన్ని ఢీకొట్టిన బైక్
- తప్పించుకున్న గంజాయి తరలిస్తున్న నిందితులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం

రామభద్రపురం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్కూటీతో పోలీసులను పరుగులెత్తించారు. అయినా గంజాయి.. సంబంధిత వాహనాన్ని వారు వదిలేసి పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొట్టక్కి వద్ద ఎస్ఐ వి.ప్రసాదరావు శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తున్నారు. సాలూరు నుంచి స్కూటీపై హెల్మెట్ ధరించిన ఇద్దరు వ్యక్తులు దూసుకురాగా అతి వేగాన్ని కంట్రోల్ చేద్దామన్న ఉద్దేశంతో ఎస్ఐ ఆపారు. వారు ఆపకపోవడంతో ఎస్ఐ స్టేషన్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి అతివేగంతో వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపాలని ఆదేశించారు. ఇద్దరు కానిస్టేబుళ్లు గాంధీ బొమ్మ సెంటర్‌లోని సాలూరు నుంచి రామభద్రపురం వచ్చే టర్నింగ్ వద్ద కాపు కాశారు. ఆ సమయంలో అటుగా వస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి వాహనాన్ని కూడా తప్పించుకొని దూసుకెళ్లిపోయారు. దీంతో డీఎస్పీ కూడా ఆ బైక్‌ను వెంటాడారు. సెంటర్‌లో ఆ సమయంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో డీఎస్పీ వాహనం వెనుకబడింది. ఈ క్రమంలో బైక్‌తో మరింత స్పీడుగా ఆ ఇద్దరు చిన్నమ్మతల్లి ఆలయం వైపున్న పక్క రూట్‌లోకి వెళ్లారు. ఆ రూట్ ఎటు వెళ్తుందో తెలియక మళ్లీ మెయిన్ రూట్‌లోకి వచ్చారు. బొబ్బిలి వెళ్లే రహదారికి వచ్చి వేగవంతంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న డీఎస్పీ వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో బైక్ కిందపడిపోయింది. అయితే వీరి వద్ద గంజాయి ఉందని తెలియక డీఎస్పీ వాహన చోదకులకు ఏమైందోనని ఆందోళన చెందారు. డీఎస్పీ తన వాహనం నుంచి దిగి వచ్చేలోపు వాహనదారులు వాహనాన్ని, వారితో ఉన్న రెండు బ్యాగులు, హెల్మెట్‌లు అక్కడే వదిలేసి పక్క పొలాల్లోకి పారిపోయారు. డీఎస్పీ వాహనం వెనుక వస్తున్న పోలీసులు వారి వెంట పడ్డారు. ఇంతలో చీకటి కావడంతో వారు రామభద్రపురం గ్రామంలోకి వెళ్లిపోయారు. పోలీసులు కనిమెరక వీధి, అగురు వీధి, గ్రామం పక్కనే ఉన్న పొలాల్లో గాలించారు. అయినా ఎక్కడా వారు కనిపించలేదు. పోలీసులు ప్రయత్నం ఫలించలేదు. ఈ క్రమంలో వాహనదారులు విడిచిపెట్టిన బైక్, రెండు బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులను పరిశీలించగా అందులో సుమారు 23 కిలోల గంజాయి ఉన్నట్టు పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ద్విచక్ర వాహన నంబరును పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు విశాఖలో ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకుని గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. కేసు నమోదు చేశారు.

గర్భిణికి స్కానింగ్ కష్టాలు



చిత్రంలో కనిపిస్తున్న గర్భిణి పేరు మాలతి. నగరంలోని అరకాల గెడ్డలో నివసిస్తోంది. నెలలు నిండడంతో అల్ట్రాసౌండ్ స్కాన్ కోసం శుక్రవారం ఘోష ఆస్పత్రికి వెళ్లారు. అక్కడి రేడియాలజిస్టు సెలవు పెట్టడంతో సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. అప్పటికే సాయంత్రం కావడంతో రశీదు పట్టుకుని శనివారం ఉదయం సర్వజన ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ స్కానింగ్ చేయమని స్పష్టం చేయడంతో.. తిరిగి ఘోష ఆస్పత్రికే వెళ్లి స్కాన్ చేయించుకుంది. నిండు గర్భిణిని అటూఇటూ తిప్పడంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

- విజయనగరం ఫోర్ట్